క్లుప్తంగా

మర్యాద పూర్వకంగా..



కలెక్టర్ మాధవీలతకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్పీ జగదీష్

సీటీఆర్‌ఐ: జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన పి.జగదీష్ శుక్రవారం కలెక్టర్ మాధవీలతను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు సమన్వయంతో పనిచేద్దామన్నారు.

రాధాకృష్ణ మందిరంలో నందోత్సవం



అన్నవితరణ చేస్తున్న శ్రీపాద హరిదాస్ బ్రహ్మచారి

సీటీఆర్‌ఐ: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల ముగింపు సందర్భంగా శుక్రవారం ఆర్యాపురం శ్రీకృష్ణ చైతన్య మిషన్ ఆశ్రమంలో నందోత్సవం ఘనంగా నిర్వహించారు. నగర సంకీర్తన, మంగళహారతి, తులసి ప్రదక్షిణ, తీర్థ ప్రసాద వితరణ జరిగాయి. ఆశ్రమ ఇన్‌చార్జి శ్రీపాద హరిదాసు బ్రహ్మచారి ఆధ్వర్యంలో జరిగిన నందోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో గోకుల్ టీవీఎస్ షోరూం అధినేత ఎస్‌వీఎస్ సత్యనారాయణ, భారత వికాస్ పరిషత్ పూర్వ అధ్యక్షుడు పీవీఎస్ కృష్ణారావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గోరంట్ల పరామర్శ

కంబాలచెరువు: స్థానిక సెంట్రల్ జైలులో ఉన్న యువగళం వలంటీర్లను రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి శుక్రవారం పరామర్శించారు. వారికి టీడీపీ అండగా ఉంటుందన్నారు. మందలపు రవికుమార్, వాసిరెడ్డి రాంబాబు, జొన్నలగడ్డ చౌదరి, కంఠమనేని శివరామకృష్ణ ఆయన వెంట ఉన్నారు.

గరికపాటి రాజారావుకు నివాళి

ప్రకాశం నగర్: అమర కళాకారుల వారోత్సవాల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక రామచంద్రరావు పేటలోని గరికపాటి రాజారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీనియర్ కళాకారుడు బొడ్డు బుల్లబ్బాయి, సీపీఐ నాయకుడు నల్లా రామారావు, జాంపేట కోపరేటివ్ అర్బన్ బ్యాంక్ వైస్ చైర్మన్ జామిశెట్టి గాంధీ, జాంపేట కోపరేటివ్ అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ ప్రసాదుల హరనాథ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రకాశం నగర్: స్థానిక 42వ డివిజన్‌లో ఈఎస్‌ఐ బస్టాప్ వద్ద డ్రైనేజీ నిర్మాణ పనులకు శుక్రవారం వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి కొబ్బరికాయ కొట్టి శ్రీకారం చుట్టారు. అనంతరం సుభాష్ నగర్‌లో సీసీ రోడ్డు, శ్రీరామ్ నగర్‌లో తారు రోడ్డు పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సుమారు రూ. 2 కోట్లతో డివిజన్‌లో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి నామన వాసు, బాలాజీ రెడ్డి, సూరిబాబు, తాతాజీ, నటరాజ్, హేమంత్, సాంబ పాల్గొన్నారు.

అంతర్జాతీయ యోగా పోటీలకు సూర్య

ప్రకాశం నగర్: థాయిలాండ్‌లోని బ్యాంకాక్‌లో ఈ నెల 9, 10వ తేదీల్లో యూనివర్సల్ యోగా స్పోర్ట్స్ ఫెడరేషన్ నిర్వహిస్తున్న అంతర్జాతీయ యోగా పోటీలకు ఎస్‌కేవీటీ కళాశాల విద్యార్థి తాడేపల్లి సూర్య ఎంపికయ్యాడు. ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ రాజాబాబు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. కర్ణాటకలోని శివమొగ్గలో జరిగిన జాతీయ స్థాయి యోగా పోటీల్లో విజయం సాధించిన సూర్య.. అంతర్జాతీయ పోటీలకు ఎంపికై నట్లు చెప్పారు. కళాశాల స్పోర్ట్స్ విభాగాధిపతి కిషోర్ బాబు, అధ్యాపకులు రమణ మూర్తి, సంజీవరావు, నరసింహ తదితరులు అభినందించారు.

వైభవంగా ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ

రాజమహేంద్రవరం రూరల్: తొర్రేడు గ్రామంలోని లక్ష్మీగణపతి ఆలయంలో ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠాపన శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానం స్థపతి రావిపాటి వెంకట ప్రసాద్ శిష్యబృందం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈనెల 5వ తేదీ నుంచి ప్రారంభమైన హోమాలు, శుక్రవారం సాయంత్రం జరిగిన సిద్ధిబుద్ధి సమేత లక్ష్మీగణపతి కల్యాణంతో ముగిశాయి. శుక్రవారం ఉదయం విశేష పూజలు నిర్వహించారు. ధ్వజస్తంభ ప్రతిష్ఠ అనంతరం భక్తులకు అన్నసమారాధన చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రయ్‌రయ్‌మంటూ..

- దూసుకుపోతున్న ఎలక్ట్రికల్ స్కూటర్లు
- పుంజుకున్న విక్రయాలు
- ఆసక్తి చూపుతున్న నగర వాసులు



షోరూంలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న ఎలక్ట్రికల్ స్కూటర్లు

ప్రకాశం నగర్: అత్యాధునిక సదుపాయాలు, ప్రత్యేక హంగులతో రూపొందించిన ఎలక్ట్రికల్ స్కూటర్లు నగరంలో రోడ్లపై దూసుకుపోతున్నాయి. ఓలా ఎస్‌వన్ ప్రో, హీరో వీడా వీవన్ ప్రో, ఏథార్ 450, టీవీఎస్ ఐక్యూ, బజాజ్ చేతక్ వంటి పలు రకాల ఎలక్ట్రికల్ స్కూటర్లు సందడి చేస్తున్నాయి. బీఎంఎస్ మోటార్‌తో నడిచే ఈ ఎలక్ట్రికల్ స్కూటర్లు బ్యాటరీ ద్వారా పనిచేస్తాయి. బ్యాకప్‌ను బట్టి సుమారు 4 నుంచి 5 గంటల చార్జింగ్‌తో గంటకు 60 నుంచి 80 కిలోమీటర్ల స్పీడ్‌తో తిరుగుతున్నాయి. డిజిటల్ డిస్‌ప్లే, యూఎస్‌బీ, మొబైల్ చార్జింగ్, బ్లూటూత్ తదితర వివిధ రకాల సదుపాయాలు ఆకట్టుకుంటున్నాయి. వీటి ప్రారంభం ధర రూ.70 వేల నుంచి రూ.1.80 లక్షల వరకూ ఉంటోంది. వీటితో పాటు టెక్నాలజీకి అనుగుణంగా బ్యాటరీతో నడిచే వివిధ ఎలక్ట్రికల్ కార్లు, రిక్షాలు, ఆటోలు వచ్చినప్పటికి జనం ఎలక్ట్రికల్ స్కూటర్ల పైనే ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు.

కాలుష్య రహిత ప్రయాణం

ఎలక్ట్రికల్ స్కూటర్ల వాడకం వల్ల ధ్వని, వాయు కాలుష్యం ఉండదని పర్యావరణ వేత్తలు చెబుతున్నారు. ప్రస్తుతం పెట్రోల్ వాడకం అధికంగా ఉన్న నేపథ్యంలో ఎలక్ట్రికల్ స్కూటర్లు ఒక ప్రత్యామ్నాయ సాంకేతిక విప్లవమని నిపుణుల అభిప్రాయం. కాగా పెట్రోల్, డీజిల్ వాహనాలతో పోలిస్తే ఎలక్ట్రికల్ స్కూటర్లు వినియోగభారం తక్కువ ఉండడంతో పాటు , పెట్రోల్ ధరలు అధికంగా ఉండడంతో నగర వాసులు ఈ వాహనాలపై ఆసక్తి చూపుతున్నారు.

తక్కువ దూరాలకు అనుకూలం

అయితే పెట్రోల్ బైక్‌లకు ఉంటే ఇంజిన్ సామర్థ్యం , రీసేల్ విలువ వీటికి ఉండడం లేదని ఆటోమొబైల్ వ్యాపారులు చెబుతున్నారు. ఎలక్ట్రికల్ స్కూటర్లు కేవలం సుమారు 100 నుంచి 150 కిలోమీటర్ల లోపు ప్రయాణానికి మాత్రమే అనుకూలమన్నారు. దూర ప్రాంతాలకు వెళ్లినప్పుడు చార్జింగ్ స్టేషన్లు కొన్ని ప్రాంతాల్లో ఉండే అవకాశం ఉంది. ఎలక్ట్రికల్ స్కూటర్లు కేవలం కళాశాలలకు వెళ్ళే విద్యార్థులకు, ఆఫీసులకు వెళ్లే ఉద్యోగులకు బాగా ఉపయోగపడతాయని చెబుతున్నారు.

డిమాండ్ పెరిగింది

మార్కెట్‌లో ఎలక్ట్రికల్ స్కూటర్లకు డిమాండ్ పెరిగింది. ఎలక్ట్రికల్ కార్లు అందుబాటులోకి వచ్చినప్పటికీ, వాటితో పోల్చితే స్కూటర్లను కొనుగోలు చేసేందుకే జనం ఆసక్తి చూపుతున్నారు. పెట్రోల్ ధరలు పెరిగిన నేపథ్యంలో వీటితో తక్కువ ఖర్చుతో ఎక్కువ దూరం ప్రయాణం చేయవచ్చు.

– శ్రీ రామ్, ఎలక్ట్రికల్ స్కూటర్ల ఫోరూమ్ నిర్వాహకుడు

పేపర్‌మిల్లును వేరేచోటుకు తరలించే అవకాశం



సమావేశంలో మాట్లాడుతున్న విశ్వేశ్వరరెడ్డి

సీటీఆర్‌ఐ: ఎంపీ మార్గాని భరత్ రామ్ చెప్పినట్టు రాజమండ్రి పేపరు మిల్లును వేరే ప్రాంతానికి తరలించే అవకాశం ఉందని గోదావరి పరిరక్షణ సమితి అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ పేపరు మిల్లుపై ఎంపీ భరత్‌రామ్ చేసిన ఆ ప్రకటనకు వైఎస్సార్ సీపీ, గోదావరి పరిరక్షణ సమితి కట్టుబడి ఉన్నాయన్నారు. ఆ ప్రదేశంలో ఐటీ హబ్ రావాల్సిన అవసరం ఉందన్నారు. 18 ఏళ్ల క్రితం అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పేపర్ మిల్లు ఎదుట లూథరన్‌గిరిలో జరిగిన కార్యక్రమానికి విచ్చేసినపుడు, మంత్రి జక్కంపూడిని పిలిచి ఈ వాసనేమిటని ప్రశ్నించారన్నారు. పేపర్ మిల్లు నుంచి వస్తున్న దుర్గంధంపై విస్మయానికి గురై, పేపర్ మిల్లును తరలించేద్దామని చెప్పారని గుర్తు చేశారు. ఆ సమయంలో పేపర్ మిల్లు ఉద్యోగిగా కార్మిక శ్రేయస్సు దృష్ట్యా తాను పేపరు మిల్లు తరలింపు వద్దని అభ్యర్థించగా, మంత్రి జక్కంపూడి, ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు సానుకూలంగా స్పందించారన్నారు. కానీ ప్రస్తుతం పేపర్ మిల్లు వ్యర్థాలతో గోదావరిలో నీరు విషతుల్యంగా మారిందన్నారు. సమావేశంలో గోదావరి పరిరక్షణ సమితి ప్రతినిధులు బర్రె కొండబాబు, ఎల్‌వీ ప్రసాద్, కానుబోయిన సాగర్, సుబ్బరాజు, ప్రవీణ్, దెయ్యాల రాజు పాల్గొన్నారు.

'కౌమారదశలో పరిశుభ్రత'పై సదస్సు

రాజమహేంద్రవరం రూరల్: కౌమార దశలోని విద్యార్థినులు తమ శారీరక, మానసిక స్థితిలో వస్తున్న మార్పులపై అనుమానాలు నివృత్తి చేసుకునేందుకు సామాజిక మాధ్యమాల వినియోగం సరికాదని డాక్టర్ వాసిరెడ్డి బిందు, డాక్టర్ అనిక అన్నారు. రాజమహేంద్రవరంలోని సత్యసాయి గురుకులంలో శుక్రవారం మధ్యాహ్నం విద్యార్థినులు, వారి తల్లులకు కౌమార దశ – పరిశుభ్రత విషయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ శారీరక మానసిక మార్పుల వల్ల పిల్లల్లో కలిగే ఒత్తిడిని తల్లులు అర్థం చేసుకుంటూ, వారితో స్నేహంగా మెలగాలని సూచించారు. గురుకులం కరస్పాండెంట్, ప్రిన్సిపల్ ఏ.శ్యాంసుందర్, కె.గుర్రయ్య పాల్గొన్నారు.

న్యాయవాదుల శాంతియుత నిరసన



నిరసన తెలియజేస్తున్న న్యాయవాదులు

కంబాలచెరువు: న్యాయవాదుల రక్షణకు కేంద్రం చట్టం చేయాలని అడ్వకేట్స్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు కోరారు. స్థానిక గోకవరం బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం శాంతియుత నిరసన తెలిపారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం వద్ద వినతిపత్రం ఉంచారు. సొసైటీ జనరల్ సెక్రటరీ ధర్నాలకోట వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇటీవల న్యాయవాదులకు రక్షణ కరువైందని, ఎక్కడ చూసినా న్యాయవాదులపై దాడులు హెచ్చుమీరుతున్నయన్నారు. ఇటీవల ఉత్తరప్రదేశ్‌లో న్యాయవాదిని ఒక దుండగుడు హత్య చేస్తే, దానికి నిరసనగా అక్కడి న్యాయవాదులు శాంతియుత ఆందోళన చేపట్టరన్నారు. అయితే అక్కడి కొందరు పోలీసులు న్యాయవాదులపై అతి దారుణంగా దాడి చేశారన్నారు. దీనికి నిరసనగా రాజమండ్రి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులందరూ విధులను బహిష్కరించారన్నారు. జాయింట్ సెక్రటరీ బీర అరుణ్ కుమార్, సొసైటీ ప్రతినిధులు అప్పికట్ల విల్సన్, ముప్పిడి బుజ్జిబాబు, దీపాటి శ్యాంబాబు, మేడిశెట్టి నాగేంద్ర, ఎస్ శ్రీకృష్ణ, ఎస్ఎల్.మురళి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో శరవేగంగా అభివృద్ధి పనులు

- ఎంపీ మార్గాని భరత్ రామ్
- ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీ భరత్ రామ్, చిత్రంలో సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. స్థానిక మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని ఎంపీ కార్యాలయంలో ఇంజినీరింగ్ అధికారులతో శుక్రవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా నగరంలోని వివిధ వార్డులలో చేపట్టిన డ్రైనేజీలు, రోడ్లు, పార్కుల అభివృద్ధి తదితర వాటిపై ఆరా తీశారు. డ్రైనేజీల నిర్మాణం, మైనర్ మరమ్మతుల విషయంలో నిర్లక్ష్యం తగదని హెచ్చరించారు. ఎక్కడైనా ఎటువంటి ఇబ్బందులు, ఆటంకాలు ఎదురైతే తక్షణం తన దృష్టికి తీసుకురావాలని ఎస్ఈ పాండురంగారావుకు ఆదేశించారు. నిర్దేశిత కాలంలో పనులు చేయకుంటే ఆయా ప్రాంత ప్రజలకు ఇబ్బందిగా ఉంటుందన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షిస్తూ సంబంధిత గుత్తేదారులచే పనులు వేగవంతంగా అయ్యేటట్లు చూడాలన్నారు. నగరపాలకసంస్థ పరిధిలో గతంలో ఎప్పుడూ చేయనన్ని అభివృద్ధి పనులు ఈ నాలుగేళ్లలో చేసి చూపించామని, ఆ విషయంలో ఆర్ఎంసీ అధికారులు చూపిన చొరవను ఎంపీ భరత్ అభినందించారు. అదే స్ఫూర్తితో నగరంలోని అన్ని డివిజన్లలో చేపట్టిన పనులను పూర్తి చేయించాలన్నారు. ప్రజలకు మనం చేసే అభివృద్ధి పనులపై స్పష్టత, అవగాహన కలగాలన్నారు. గత టీడీపీ హయాంలో రహదారులు, డ్రైనేజీల దుస్థితి, వైఎస్సార్ సీపీ హయాంలో జరుగుతున్న అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తోందన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, ఆర్ఎంసీ ఎస్ఈ పాండురంగారావు, ఈఈలు కనకారావు, శేషగిరి, ఆలి, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

ఈ–క్రాప్ నమోదుతో అనేక ప్రయోజనాలు

కడియం: ఈ–క్రాప్ నమోదుతో అనేక ప్రయోజనాలున్నాయని, రైతులందరూ తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.ద్వారకాదేవి అన్నారు. శుక్రవారం వ్యవసాయాధికారి కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ ఈలి గోపాలరావు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏవో కె.ద్వారకాదేవి మాట్లాడుతూ పంటల నమోదు చేయించుకోవడం వల్ల ధాన్యం కొనుగోలు ప్రక్రియ, పంట నష్ట పరిహారం, క్రాప్ ఇన్సూరెన్స్ వంటి వాటిని పొందవచ్చన్నారు. తహసీల్దార్ సుజాత మాట్లాడుతూ ప్రతి రైతుభరోసా కేంద్రం లోనూ ఖరీఫ్ ధాన్యం కొనుగోలు సమయానికి అంటే ముందుగానే గోనె సంచులు అందుబాటులో ఉంచడం జరుగుతుందన్నారు. మండల పశుసంవర్ధక అధికారి మాట్లాడుతూ మండలంలోని రైతుభరోసా కేంద్రాల్లో పశుగ్రాస విత్తనాలు (జొన్న, మొక్కజొన్న) అందుబాటులో ఉన్నాయన్నారు. పశువులకు గొంతువాపు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నామని, ఆవులకు ముద్దచర్మ వ్యాధి టీకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కడియం మండలంలో రీసర్వే చేస్తున్న సమయంలో పాసుబుక్‌లో విస్తీర్ణం తప్పుగా నమోదు కాబడిన వాటి వివరాలు సరిచేయాలని తహసీల్దార్‌కు రైతులు విన్నవించారు.

సమాజంలో అందరూ అక్షరాస్యులు కావాలి

రాజమహేంద్రవరం రూరల్: సమాజంలో అందరూ అక్షరాస్యులు కావాలని సిల్లా లయన్స్‌క్లబ్ పాస్ట్ గవర్నర్ మాటూరి మంగతాయారు అన్నారు. ప్రపంచ అక్షరాస్యతా దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ రాజమండ్రి మహిళ ఆధ్వర్యంలో కొంతమూరు చెంచుకాలనీలో ఏర్పాటు చేసిన వయోజన విద్యా కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన లయన్స్ క్లబ్ మహిళ ప్రెసిడెంట్ కొయ్యన కుమారి మాట్లాడుతూ ఈ కేంద్రంలో 30 మంది వయోజనులకు డిసెంబర్ నెలాఖరు వరకూ చదువు చెబుతారన్నారు. అందరికీ పలకలు, బలపాలు అందజేశారు. లయన్స్ క్లబ్ మహిళ కోశాధికారి మాధవీలత పాల్గొన్నారు.

వైభవంగా వ్యూహాలక్ష్మి అమ్మవారి హోమం



హోమం నిర్వహిస్తున్న చిన్న వెంకన్నబాబు తదితరులు

సీటీఆర్‌ఐ: గాడాలలోని మహాలక్ష్మి సమేత చిన్న వెంకటేశ్వరస్వామి పీఠంలో శుక్రవారం వ్యూహాలక్ష్మి, వారాహి దేవి అమ్మవార్లకు హోమం నిర్వహించారు. గురువారం వ్యూహలక్ష్మీ అమ్మవారి నూతన పంచలోహ విగ్రహ ప్రతిష్ఠాపన వైభవంగా జరిగింది. ఆ సందర్భంగా అమ్మవార్లకు ఉదయం 5.48 నుంచి రాత్రి 6.45 గంటల వరకూ నిర్విరామంగా హోమం జరిపారు. ఈ సందర్భంగా చిన్నవెంకన్నబాబు మాట్లాడుతూ తిరుమల క్షేత్రంలో శ్రీవారి వక్షస్థలంలో కొలువై ఉన్న శక్తి స్వరూపం వ్యూహాలక్ష్మీదేవి అన్నారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో శ్రీమాన్ పెరవలి సాయిరామ్ ఆచార్యులు, మనగుడి, మనసేవ భారతీయ ఆధ్యాత్మిక సేవా సమితి జాతీయ చైర్మన్ ధరణికోట దుర్గా వెంకట హేమావతి, ఉభయ రాష్ట్రాల చైర్మన్ మతల రమేష్, వైస్ చైర్మన్ టీవీ అప్పారావు పాల్గొన్నారు.

కాలుష్య నివారణపై సదస్సులు



మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

కంబాలచెరువు: ఘన వ్యర్థాలు, ప్లాస్టిక్, బయో మెడికల్ ఈవేస్ట్, వ్యర్థాల రీసైక్లింగ్, వాతావరణ కాలుష్యం నియంత్రణ తదితర అంశాలపై జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహించాలని ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత సూచించారు. స్థానిక జిల్లా ప్రధాన న్యాయస్థానం ఆవరణలో శుక్రవారం కాలుష్య నియంత్రణ బోర్డు, మునిసిపల్, అటవీ, రవాణా శాఖల అధికారులతో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాలను అనుసరిస్తూ నదులు, సరస్సులు, కాలువలలో నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గాలి, ఇతర ప్రకృతి వనరులను కాలుష్యం నుంచి పరిరక్షించేందుకు వివిధ కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఈ కార్యాచరణ నివేదికను జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు అందించాలని ఆదేశించారు.

అర్హులందరికీ లబ్ధి చేకూర్చడమే లక్ష్యం

- సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్
- 38వ డివిజన్‌లో గడప గడపకూ..



వీరభద్రపురంలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్

సీటీఆర్‌ఐ: చిట్టచివరి లబ్ధిదారుడికీ పథకాలు అందించడమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానిక 38వ డివిజన్ ఇన్‌చార్జి, ఉమా కోటిలింగేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ అరిగెల బాబు ఆధ్వర్యంలో వీరభద్రపురంలోని కోదండ రామాలయం నుంచి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా కోదండ రామాలయంలో పూజలు చేశారు. అనంతరం వర్షాన్ని సైతం లెక్కచేయకుండా డివిజనల్‌లో పర్యటించారు. ప్రతి గడపకూ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరును తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించడమే లక్ష్యంగా సీఎం జగనన్న పనిచేస్తున్నారన్నారు. కాగా.. జగన్ పాలనపై, అందిస్తున సంక్షేమ పథకాలపై ప్రజలందరూ హర్షం వ్యక్తం చేశారు. ఆయనను మళ్లీ సీఎంగా గెలిపించుకుంటామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, ఇండస్ట్రీస్ డెవలప్మెంట్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ కానుబోయిన సాగర్, పార్టీ నాయకులు మజ్జి అప్పారావు, నామన వాసు, అజ్జరపు వాసు, నిరీక్షణ జేమ్స్, ఇసుకపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో ఇంటిలోనే పౌష్టికాహారం



వారోత్సవాలలో పాల్గొన్న ప్రియాంక తదితరులు

సీటీఆర్‌ఐ: తక్కువ ఖర్చుతో ఇంటిలోనే పౌష్టికాహారాన్ని తయారు చేసుకోవచ్చని మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ టీఎంఓ ప్రియాంక అన్నారు. స్థానిక ఆర్యాపురం మున్సిపల్ స్కూల్లో చదివే విద్యార్థుల తల్లులకు శుక్రవారం సచివాలయ వద్ద వంటల పోటీలను ఏర్పాటు చేశారు. తక్కువ ఖర్చుతో ఇంటి వద్ద లభించే దినుసులతో పౌష్టికాహారాన్ని తయారు చేసుకువచ్చిన వారికి బహుమతులు అందించారు. ఈ పోటీలో సుమారు 50 మంది పాల్గొన్నారు. చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రియాంక మాట్లాడుతూ పోషకాహార వారోత్సవాల సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. యూత్ మెంటర్లు సీహెచ్ స్వర్ణ, ఎ.స్వాతి, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

యానాదులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



ఐక్యత చాటుతున్న రామచంద్రయ్య తదితరులు

సీటీఆర్‌ఐ: యానాదులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని యానాది సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుడుమల రామచంద్రయ్య అన్నారు. నగరపాలక సంస్థ సమీపంలోని అంబేడ్కర్ భవన్‌లో శుక్రవారం సంఘ రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. రామచంద్రయ్య మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 12 లక్షల మంది యానాదులు ఉన్నారని, వారిని కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే రాజకీయ పార్టీలు చూస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో ఆరు శాతం, దేశంలో ఏడు శాతం ఉన్న యానాదులు.. ప్రభుత్వ ఉద్యోగులుగా కేవలం ఒక్క శాతం మాత్రమే ఉన్నారన్నారు. సంఘం రాష్ట్ర చైర్మన్ బాపట్ల ప్రసాద్ మాట్లాడుతూ ఎస్టీలుగా పరిగణించబడుతున్న యానాదులు నేటికీ అభివృద్ధికి నోచుకోలేదున్నారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బీఎల్ శేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, నెల్లూరు జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ చౌటూరు సీనయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్కే బాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పసులేటి రాజు పాల్గొన్నారు.

ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): విధి నిర్వహణ ఒత్తిడిగా ఉందంటూ వార్డు సచివాలయ ఉద్యోగి ఒకరు ఆత్మహత్యా యత్నానికి పాల్పడి, ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. నగరంలోని సుబ్బారావు నగర్‌కు చెందిన గారా వినోద్‌కుమార్ 35వ వార్డు సచివాలయంలో వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. ఇటీవల అతడికి బూత్ లెవెల్ ఆఫీసర్ (బీఎల్ఓ) విధులను సైతం రెవెన్యూ అధికారులు అప్పగించారు. ఈ అదనపు పని ఒత్తిడిగా ఉంటోందని వినోద్ కుమార్ అధికారులకు చెప్పాడు. అధికారులు పట్టించుకోకపోవడంతో నిద్ర మాత్రలు తెచ్చుకుని నగర పాలక సంస్థ కార్యాలయంలో మింగాడు. గమనించిన కొంతమంది ఉద్యోగులు అతడిని ఇంటికి తీసుకువెళ్లి అప్పగించారు. వెంటనే వినోద్‌కుమార్‌ను కుటుంబ సభ్యులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అతడు కోలుకుంటున్నాడు. వినోద్ కుమార్ ఫిర్యాదు మేరకు ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు ఫిర్యాదు తీసుకుని త్రీటౌన్ పోలీసులకు పంపించారు. అయితే, సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం ఆత్మహత్యా యత్నం కేసు నమోదు చేయడానికి వీలు లేదని త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ మధుబాబు విలేకర్లకు తెలిపారు.

ఉత్సాహంగా నాభూమి- నాదేశం

ప్రకాశం నగర్: భారతీయ జనతా పార్టీ అర్బన్ ఒకటో డివిజన్ అధ్యక్షుడు బండి సత్యప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక నారాయణపురం వాంబే గృహాల వద్ద నా భూమి నా దేశం కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ ధార్మిక సెల్ కన్వీనర్ సత్యగోపీనాథ్‌దాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.